# పనిష్మెంట్

రెడ్డి గారి భవంతి వచ్చేపోయే జనంతో కోలాహలంగా వుంది. పైరవీలకు, పంచాయితీలకు, తీర్మానాలకు ఆ ఇల్లు ఓ వేదిక. సూర్యోదయంతో వచ్చిన మోతీ అలాగే గేటు పిల్లరును ఆనుకొని కూర్చుంది.

మోతీ ముఖంలో నిరాశలు గూడు కట్టుకొని ఉన్నాయి. ముడతలు పడ్డ ముఖంలో, జీవితంలోని కష్టాలకు గుర్తుగా నొసటిపై గీతలు అడ్డంగా వున్నాయి.

కళ్ళలో ఏవో ఆశలు మిణుగురు పురుగుల్లా వెలుగుతున్నాయి. కొడుకు రాముడు హత్య చేశాడని న్యాయస్థానం రుజువు చేసింది. అతనికి ఉరిశిక్ష విధించింది. ఆ ఆలోచనలతో మోతీ గుండెలు బరువెక్కుతున్నాయి. కొడుకు లేని చివరి జీవితాన్ని ఊహించుకోలేకపోతుంది.

కోర్టులో వకీళ్ళతో ఇక లాభం లేదని రాష్ట్రపతి క్షమాభిక్ష కోసం రాజారెడ్డి గారనే ఆ ప్రాంతపు ఎం. ఎల్. ఏ గారిని ఆశ్రయించింది.

వారి దర్శనం కోసం ఎదురుచూస్తూ ఉంది. తనకున్న అయిదెకరాల మెట్ట పొలం అమ్మి ఎం. ఎల్. ఏ గారి చేతిలో పోసింది. కానీ అనుకున్నంత ఫలితం కనబడలేదు.

ఉరితీసే గడువు సమీపిస్తోంది. మృత్యుకుహరంలోకి ప్రవేశించనున్న కొడుకు జీవితాన్ని తలచుకొని ఎంతగానో ఏడుస్తుంది. భరించలేని బాధ గుండెను పిండేస్తుంటే రెండేళ్ళనుండీ కంటికి నిద్ర లేదు, కాలికి నిలకడ లేదు.

భర్త పోయాడన్న బాధ, కొడుకు చస్తాడన్న వ్యధ మోతీని కృంగదీస్తున్నవి.

ఇంతలో రాజారెడ్డి గారు పెళ్ళిపీటలమీదికెళ్ళే పెండ్లి కొడుకులా వచ్చాడు. పెదవులపై చిరునవ్వులు తొణికిసలాడుతున్నాయి. తెల్లని ఖద్దరు ధోవతి, సిల్కు లాల్చీ అతని హుందాతనాన్ని చాటుతున్నాయి.

రాజారెడ్డిని చూడగానే దేవుణ్ణి చూసినంత పనైంది మోతీకి. అంతవరకు ఆపుకున్న దుఃఖం ఒక్కసారిగా పెల్లుబికింది.

"దొరా ! ఖర్చులకు భయపడకండి, మిగిలిన ఆ చెలకనైనా అమ్మి నా కొడుకు ప్రాణాలు నిలబెట్టండి. ఎట్లాగైనా వాడు బ్రతకాలి " అంటూ తన నిశ్చయాన్ని వెలిబుచ్చింది.

కేసును ఆలోచిస్తూ సిగారు వెలిగించాడు ప్రజానాయకుడు.

మోతీ ఇంకా తన గోడును వెళ్ళగ్రక్కుతూనే వుంది. వాని శని మూడింది. వాడి తండ్రిని వాడే సంపుకున్నాడు. మందినేమైనా సంపిండా ? అంటూ 'లా' కు దొరకని పాయింటుతో ఏడుస్తూ మాట్లాడుతుంది.

అది విన్న రాజారెడ్డి "తను చావడానికి కూడా చట్టం ఒప్పుకోదు. అదిహత్య అయినా ఆత్మహత్య అయినా నేరం, నేరమే శిక్ష తప్పదు" అన్నాడు.

"సచ్చిన ముసలోడు ఎలాగో సచ్చిపాయె ! కనీసం ఈడన్నా బతకాలి కదా ! పెండ్లాం ఏడ్చి, ఏడ్చి సగం అయింది. ఆని అత్తగారోళ్ళు కూడా కొంత డబ్బిస్తామంటున్రు. ఏదన్నా సేసి నా కొడుకు ప్రాణం కాపాడు దొరా ! నీ ఆకిలి ఊకి నా రుణం తీర్చుకుంటా" అంటూ మోతీ వెక్కి వెక్కి ఏడుస్తూ ఉంది.

అప్పుడే అక్కడికొస్తున్న కోడల్ని చూపిస్తూ -

"అదిగో అది కూడా వస్తుంది. దాని ముఖం చూడు దొరా ! అది కుమిలి కుమిలి ఏడ్చి సస్తుంది. అది కాపురానికొచ్చి కొద్ది రోజులయినా కాలేదు. వాడేమో జైలు పాలయ్యిండు. ఆనాటి నుండి దాని కంటికి కునుకు లేదు. దాని ముఖం సూసైనా సరే, ఆని పాణం కాపాడండి"

నేలను చూస్తూ ఏడుస్తున్న కోడలు లచ్చిమి దగ్గరకెళ్ళి తల నిమురుతూ -

"ఊర్కో, ఊర్కో దొర ఏలాగైనా నీ పసుపు కుంకుమ కాపాడతాడు, ఏడవకు" అంది.

రాజారెడ్డి ఆమె వైపు చూస్తూ, ఇంత చిన్న వయసులో వచ్చిన ఆపదను ఆలోచిస్తూ, సిగార్ దమ్ములాగి పొగను గాలిలోకి వదిలాడు.

"ఇంకా ప్రయత్నం చేద్దాం, రేపు ముఖ్యమంత్రిని కలుద్దాం. ఆయన ద్వారా ఢిల్లీకి ఫోను చేయిద్దాం. ఈసారి తప్పకుండా అవుతుంది"

రాజారెడ్డి మాటలకు మోతీ ప్రాణాలు లేచివచ్చినయి. కోడలు కళ్ళలో కొత్త కాంతులు వెలిగినయి. మోతీ రెడ్డి కాళ్ళకు మొక్కుతూ ఉంది. కోడలు లచ్చిమి కొంగుతో కంట్లను తుడుచుకుంటుంది.

లచ్చిమికి పాతికేళ్ళు. పసుపు పచ్చని రంగు, నల్లని కళ్ళు, తెల్లని పళ్ళు. రెడ్డి చూపులు తడబడ్డాయి.

సిగారును నేలకేసి విసిరి, మోతీని దగ్గరికి పిలిచి చెవిలో ఏదో చెప్పాడు రెడ్డి.

"అమ్మో ! వద్దు దొరా ! "అంటూ నోరు మూసుకుంది. మళ్ళీ చెప్పాడు రెడ్డి.

"అమ్మో ! అది నాతో కాని పని దొరా" అంటున్న మోతీకి వణుకులాంటిది

మొదలయింది.

రాజారెడ్డి పెదాలపై ఓ మాదిరి నవ్వు నాట్యం చేసింది.

"ఇది మాత్రం నాతో అయ్యే పనా ?"

మాటకు మోతీ కొంత సేపు రాయిలా నిలబడింది.

"అప్పటికి పైకం తీసుకొని వస్తా !" అంటూ కోడలితో వెళ్ళిపోయింది.

దారిలో రెడ్డిగారు తన చెవిలో చెప్పిన రహస్యాన్ని కోడలు చెవిన వేసింది. అప్పుడు మోతీ కాళ్ళు వణికినయి. నాలికపై తడి ఆరి మాటలు తడబడ్డాయి. అది విన్న లచ్చిమి బొమ్మలా నిలబడింది. అలా నిలబడ్డ లచ్చిమి కళ్ళలోనుండి ఏకధారగా కన్నీరు జారుతూ ఉంది. భగవంతుడా ! నన్ను ముందు చంపు అన్నప్పుడు ముక్కు పుటాలు కదిలి వేడి శ్వాస బయటికి వచ్చింది.

" ఆయన ఎలాగూ సస్తడు. నేనూ సస్త. కానీ ఈ పని చెయ్యలేను "

" ఎవ్వరూ సావకూడదు. ఇద్దరూ బతకాలి. అందుకే -" మోతీ అనుకోని నిబ్బరంతో అంది.

" ఎట్లా బతికేది ? ఎంసేసేది ? ఆ తర్వాత ఈ ముఖం ఎట్లా సూపేది ? ఈ కుంపటి ఎట్లా భరించేది ? "

"బతకాలి - భరించాలి. నా భర్తను నీ భర్త సంపినా నేను కోర్టులో సంపలేదని సాక్ష్యం ఇవ్వలేదా ? "

"ఆయన మాత్రం కావాలని సంపిండా ? ఏదో మాట మీద మాట పెరిగి పెద్ద జగడమైంది "

" ఏది ఏమైనా సంపిండా లేదా? కోర్టులో అబద్ధం సెప్పిన్నా సెప్పలేదా ? "

"అది నీ కడుపు తీపి. అయినా నాకు సెప్ప నీకు నోరెట్లా వచ్చింది ? "అంటూ కుడి చేతితో తన నోరు మూసుకొంటూ ఏడుస్తూ వుంది.

" ఆ ... ఆ కడుపు తీపే ..... ఆ నోరే అదే నా భర్తను సంపినా సంపలేదన్న ఆ నోరే, ఈ రోజు సెప్పేది "

"ఆపు అత్తా ... ఆపు అంటూ లచ్చిమి ఏడుస్తూ వుంది. కానీ....కానీ.... ఒక్కసారి ఆయనను సూసి వచ్చినంక "

" ఎందుకు ? ఈ విషయం వానితో సెపుతావా ఏం ? "

" లేదు ! ఆయన్ని సూసి వస్త అంతే "

* * *

జైల్లో విజిటర్సు గది.

గది బయట జవాను.

గదిలో రాముడు, లచ్చిమి. చుట్టూరా భయంకరమైన నిశ్శబ్దం.

ఇద్దరి కళ్ళల్లో నీళ్ళు సుళ్ళు తిరుగుతున్నాయి.

"అత్త రెడ్డి గారితో మాట్లాడింది" అంటూ లచ్చిమి కళ్ళనీళ్ళు కార్చడం మొదలుపెట్టింది.

"ఏమన్నాడు ? రావుడు"

"తప్పక ఇడిపిస్తానన్నాడు, కానీ - "

"పైకం కావాలన్నాడా ? "

"సెలకనమ్మి పైకం ఇస్తమన్నం ... "

"మరి .... "

.....

"సెప్పు... "

ఎలా చెపుతుంది ? ఏమని చెపుతుంది ? ఏడ్వటం తప్ప...

"చలో..చలో టైమ్ హోగయా... జైల్ జవాను విదిలింపు "

" ఏదడిగినా ఇచ్చేయండి, ఎంతడిగినా ఇచ్చేయండి. చెలక, బావి అన్నీ ... "

"కాదు, అవ్వన్నీ కావు " అంటూనే నేలను చూస్తుంది.

కడుపులో కదిలిన దుఃఖం కనురెప్పలను తన్నుకొస్తుంది.

"నేను బతకాలి.. "

"చలో చలో బాహర్ చలో... "

రావుడు జైల్లోకి, లచ్చిమి బయటకు నడిచారు.

* * *

పట్టణంలో అధునాతనమైన హోటల్ గది. చాలా అందంగా, విలాసంగా ఉంది. మెత్తని డన్‌లప్ బెడ్‌పై తెల్లని బెడ్‌షీట్ పాలమీగడలా వుంది. లచ్చిమి వలలో చిక్కుకున్న లేడిపిల్లలా బెదురు బెదురుగా అదే బెడ్ మీద కూర్చుంది.

ఎదుట సోఫాలో కూర్చున్న రాజారెడ్డి, కాలుతున్న సిగరెట్టును యాష్‌ట్రేలో నలిపి వదలి, "అబ్బ ! దిరిసెన పువ్వులా వున్నావ్.... అంటూ " లచ్చిమి దగ్గరికి జరిగి కూర్చున్నాడు.

లచ్చిమికి గుండె వేగం హెచ్చినట్లయింది. రెండు చేతులతో ఆమె గుండెను అదిమి

పట్టుకొని, మంచపు మూలన ఒదిగిపోతూ, తన పైకి వస్తున్న రెడ్డినే చూస్తూ ఉంది. అప్పుడామెకు వంటిలోని నరాలు మొద్దుబారిపోతున్నట్లు, గుండె గడ్డ కట్టినట్లు అనిపించింది.

"ఏయ్ ! ఎందుకట్ల బెదిరిపోతావ్. ఇక్కడ ఎవరూ రారులే ! "

ఆమె రెప్ప వాల్చకుండా అతన్నే చూస్తుంది. ఆయన అన్న మాట ఆమె చెవిని తాకినట్లు లేదు. కానీ ఆతని చేతులు ఆమె భుజాలను తాకినట్లు అనిపించింది.

కళ్ళలో భయం, చూపుల్లో బెదురు, శ్వాసలో బాధ, వంటిలో వణుకు. కనురెప్పలు కొట్టుకోవడం మానేశాయి.

ఆమె మనసులో అత్తా - భర్త రూపాలు కదిలాయి.

'ఎవ్వరూ.... సావకూడదు ' అత్త

'నేను బతకాలి ' భర్త.

బాధగా తలెత్తి చూసింది. వెలుగుతున్న ట్యూబ్‌లైట్ దగ్గర ఎగురుతున్న ఓ చిన్న మిడతను ప్రక్కనే పొంచి వున్న బల్లి నోట కరచి పట్టింది.

ఆయన లచ్చిమిని కసిగా తన కౌగిట్లో అదిమి పట్టాడు.

బల్లి నోటిలో ఉన్న మిడత గిలగిల తన్నుకుంటూ ఉంది.

అతని కౌగిట్లో ఆమె భయంగా, బాధగా శ్వాస వదులుతూ ఉంది.

బల్లి మిడతను చిదిమి - చిదిమి మింగింది.

* * *

వారం గడిచాక ఓ ఉదయం రావుడిని ఉరి తీశారు.

ఆ వార్త విన్న మోతీ ఏడ్చి, ఏడ్చి మూగయింది.

లచ్చిమి మాత్రం ఏడవడం లేదు, నవ్వుతూ ఉంది.

* * *

కొన్నాళ్ళ తరువాత మళ్ళీ ఎన్నికలొచ్చాయి. తండ లోని గిరిజనులను ఉద్దేశిస్తూ రెడ్డి -

" నేను రావునికి ఉరిశిక్షను తప్పించాలని, హైదరాబాదు, అంతే కాదు ఢిల్లీకి తిరిగి ప్రయత్నించినా, ఫలించలేదన్న విషయం మీకందరికీ తెలుసు .. "

అంతలోనే ఓ రాయి వచ్చి రెడ్డి తలకు తగిలింది. "అమ్మా" అంటూ కుప్పకూలాడు. రాయి ఎటునుండి వచ్చింది ? చుట్టూరా జనం చూపులు, పోలీసుల ఉరుకులు, పరుగులు.

●